

గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌ను చూసి నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

గజ్వేల్‌లో ప్రచార రథంపై వస్తున్న కేసీఆర్‌ను చూసి అభివాదం చేస్తున్న కార్యకర్తలు

# గులాబీమయం

## గుబాళించిన గులాబీ దండు... గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ నామినేషన్

- రెండు సెట్ల నామినేషన్లు దాఖలు
- పూలవర్షం కురిపించిన నాయకులు, కార్యకర్తలు
- ఘన స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు
- ప్రచారరథంపై అభివాదం చేసిన కేసీఆర్
- భారీగా ద్విచక్ర వాహనాల ర్యాలీ
- పెద్ద ఎత్తున తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- అనంతరం గజ్వేల్ నుంచి కామారెడ్డికి సీఎం ప్రయాణం

గజ్వేల్, నవంబర్ 9: ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రం నుంచి సీఎం కేసీఆర్ గురువారం ఉదయం గజ్వేల్‌కు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. హెలిప్యాడ్ దిగిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రత్యేక కాన్వాయ్‌లో ఐవోసీ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకొని గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మొదటి సెట్‌ను మాజీ జడ్పీ చైర్మన్ ఎం.లక్ష్మీకాంతారావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ములుగు ఏఎంసీ చైర్మన్ జహంగీర్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి, రెండో సెట్‌ను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మెదక్ జడ్పీ చైర్ పర్సన్ హేమలత, మాజీ ఎంపీపీ చిన్నమల్లయ్య, మాజీ జడ్పీటీసీ రామచంద్రం ప్రతిపాదించారు. నేరుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకొని ముఖ్యమంత్రి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్‌వో బన్సీలాల్‌కు అందజేశారు. అనంతరం హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న సీఎం కేసీఆర్‌కు గజ్వేల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు.



గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

### పూలవర్షం కురిపించిన కార్యకర్తలు...

గజ్వేల్‌లో నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు పార్టీ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. హెలికాప్టర్ నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి బయలుదేరిన సీఎం కేసీఆర్‌కు రోడ్డుమార్గంలో పూలవర్షం కురిపించారు. వాహనశ్రేణిపై పూలుచల్లుతూ అభిమానాన్ని చాటుకున్నారు.

### సీఎం కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు

గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేసేందుకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. హెలికాప్టర్‌లో గజ్వేల్‌కు చేరుకొని నామినేషన్ వేసేందుకు వెళ్లి తిరిగి హెలిప్యాడ్ ప్రదేశానికి చేరుకున్న తర్వాత ముఖ్యమంత్రికి పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్సీలు డాక్టర్ యాదవరెడ్డి, రఘోత్తమం రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మెదక్ జడ్పీ చైర్ పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు మడుపు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, పన్యాల భూపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, రైతుబంధు సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవీరవీందర్, ఎంపీపీలు అమరావతి, లత, బాలేషంగౌడ్, పాండుగౌడ్, జడ్పీటీసీ మల్లేశం, సుధాకర్‌రెడ్డి, జయమ్మాఅర్జున్‌గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధు, కరుణాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, నాయకులు కిషన్‌రెడ్డి, విరాసత్‌అలీ, రూబెన్ ఉన్నారు.

### ప్రచారరథంపై తిరుగుతూ అభివాదం చేసిన సీఎం కేసీఆర్

గజ్వేల్ ఐవోసీ కార్యాలయంలో సీఎం కేసీఆర్ నామినేషన్ వేసిన తర్వాత హెలిప్యాడ్ ప్రదేశానికి చేరుకొని ప్రచార రథంపై తిరుగుతూ కార్యకర్తలకు అభివాదం చేశారు. ప్రజలు జై కేసీఆర్, జై బీఆర్ఎస్ అంటూ నినాదాలు చేశారు. వేలాది మంది కార్యకర్తలతో ఐవోసీ కార్యాలయ వెనక మైదానం మార్మోగింది.

### గ్రామాల నుంచి భారీ బైక్ ర్యాలీ

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల నుంచి భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీతో గజ్వేల్‌కు తరలివచ్చారు. ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్, పిడిచేడ్ నుంచి గజ్వేల్, సంగాపూర్ నుంచి గజ్వేల్, ధర్మారెడ్డిపల్లి నుంచి గజ్వేల్ మార్గాలు ద్విచక్ర వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ఉదయం 9 గంటల నుంచే అన్ని దారులు గజ్వేల్ వైపే కనిపించాయి. భారీ బైక్ ర్యాలీ గజ్వేల్‌కు చేరుకోవడంతో గులాబీమయంగా కనిపించింది. గజ్వేల్ రూరల్ మండలం నుంచి ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండే మధు ఆధ్వర్యంలో భారీబైక్ ర్యాలీని కోటమైసమ్మ దేవాలయం నుంచి ఐవోసీ భవనం వెనుక మైదానం వరకు తీశారు. చెట్లు, భవనాలపై నిలబడిన జనం సీఎం కేసీఆర్‌ను చూశారు.

### ఆప్యాయంగా పలకరించిన కేసీఆర్

నామినేషన్ వేసిన తర్వాత తిరిగి కామారెడ్డికి వెళ్తున్న సందర్భంలో హెలిప్యాడ్ వద్ద సీఎం కేసీఆర్‌కు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ప్రతి ఒక్కరినీ కేసీఆర్ ఆప్యాయంగా పలకరించారు.


### గులాబీమయమైన గజ్వేల్

సీఎం కేసీఆర్‌ను చూసేందుకు గజ్వేల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావడంతో గజ్వేల్ పట్టణం గులాబీమయమైంది. రోడ్లన్నీ బైక్‌ర్యాలీలతో కిక్కిరిసికనిపించాయి. పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా గజ్వేల్‌కు చేరుకున్నారు. హెలికాప్టర్ దిగిన కేసీఆర్ అభివాదం చేయగానే హ్యాట్రిక్ సీఎం కేసీఆర్, కేసీఆర్ జిందాబాద్, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ప్రచారం రథం నుంచి అభివాదం చేసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తరలిరావడంతో గులాబీ శ్రేణుల్లో కొత్త జోష్ కనిపించింది.

### సీఎం కేసీఆర్ నామినేషన్ సైడ్‌లైట్స్

గజ్వేల్ అర్బన్, నవంబర్ 9: ఉదయం 9:00 గంటల నుంచే గజ్వేల్ పట్టణంతో పాటు అన్ని మండలాలు, ఆర్అండ్ఆర్ కాలనీ నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గజ్వేల్‌కు చేరుకున్నారు. హెలిప్యాడ్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేయడంతో అరకిలోమీటరు దూరం నుంచి కేసీఆర్‌ను చూడడానికి అనుమతించారు. ఐవోసీ కార్యాలయానికి వచ్చే నాలుగు దారుల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో రోడ్లన్నీ నిండిపోయాయి.

- ఉదయం 10:54 గంటలకు సీఎం కేసీఆర్ ప్రయాణించిన హెలికాప్టర్ గజ్వేల్‌కు రావడంతో కార్యకర్తలంతా పెద్ద ఎత్తున జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు.
- ఉదయం 10.57 గంటలకు ఐవోసీ పక్కన గల గ్రౌండ్‌లో హెలిప్యాడ్‌పై హెలికాప్టర్ ల్యాండ్ అయ్యింది.
- ఉదయం 10.58గంటలకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్ నుంచి దిగారు. అక్కడే ఉన్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికారు.
- ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డితో పాటు డీసీసీబీ చైర్మన్ చిట్టిదేవేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆత్మకమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, నాయకులు కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు విరాసత్‌అలీ, గజ్వేల్ ఎంపీపీ అమరావతి శ్యామ్‌మనోహర్, జడ్పీటీసీ పంగమల్లేశం, జగదేవ్‌పూర్ ఎంపీపీ బాలేశంగౌడ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మర్కూక్ ఎంపీపీ పాండుగౌడ్, మండలాధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, కౌన్సిలర్లు సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికి ఫొటోలు దిగారు. నామినేషన్ వేయడానికి బయలుదేరుతున్న కేసీఆర్‌కు మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్ దట్టీ కట్టగా, గజ్వేల్ ఎంపీపీ అమరావతి బొట్టుపెట్టారు.
- ఉదయం 11.03 గంటలకు సీం కేసీఆర్ కారులో ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ముఖ్య నాయకులు లక్ష్మీకాంతారావు, కొట్టాల యాదగిరి, భూంరెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్‌తో కలిసి నామినేషన్ దాఖ లు చేశారు. రెండో సెట్‌ను మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్, ఎఫ్‌డీసీ ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ చిన్నమల్లయ్య, ఎంబరి రామచంద్రంతో కలిసి దాఖలు చేశారు.
- ఉదయం 11:24 గంటలకు ఆర్డీవో కార్యాలయం నుం చి బయటకు వచ్చారు.
- 11:25 గంటలకు ప్రచార రథంలో సీఎం కేసీఆర్ ఎక్కి హెలిప్యాడ్ చుట్టూ తిరుగుతూ కార్యకర్తలు, ప్రజలకు అభివాదం చేశారు.
- 11.31 గంటలకు ప్రచార రథం దిగారు.
- 11.34 గంటలకు హెలికాప్టర్ ఎక్కారు.
- 11.38 గంటలకు హెలికాప్టర్‌లో తిరిగి బయలుదేరారు. సీఎం కేసీఆర్ హెలికాప్టర్ దిగి కారులో నామినేషన్‌కు వెళ్తున్నప్పుడు కార్యకర్తలు, నాయకులు గులాబీ పూలు చల్లుతూ జై కేసీఆర్, జైజై కేజీఆర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



అభిమాన నేత తన గుండెపై పదిలంగా...



గజ్వేల్‌లో ర్యాలీగా వస్తున్న కార్యకర్తలు



గజ్వేల్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌ను చూసి నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు



సిద్దిపేట మెహిన్‌పురా వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేటలో నామినేషన్ పత్రాలపై సంతకం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

# సిద్దిపేట గౌరవం నిలబెట్టుకుందాం

**ఐదేండ్లు అనే పరీక్ష రాసిన.. ఎన్ని మార్కులు వేస్తారనేది ప్రజల చేతుల్లోనే ఉంది**

## సిద్దిపేట జిల్లాకు ప్రత్యేకత.. ప్రతిష్ట ఉంది

- కాంగ్రెస్..బీజేపీలను నమ్మితే గోస పడతాం
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు
- సర్వమత ప్రార్థనలు చేసి సిద్దిపేటలో నామినేషన్ వేసిన మంత్రి

సిద్దిపేట, నవంబర్ 9: ''సిద్దిపేట ప్రజలే ప్రచారకులు, జిల్లా కేంద్రానికి ఉన్న గౌరవాన్ని నిలబెట్టుకుందాం'' అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని మెహిన్‌పురా వేంకటేశ్వరాలయంలో నామినేషన్ పత్రాలకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఇక్బాల్ మినార్ వద్ద గల ఈద్గా, సిద్దిపేట సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సిద్దిపేట రిటర్నింగ్ కార్యాలయంలో అధికారి రమేశ్‌బాబుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ... సిద్దిపేట ప్రజలు ప్రజాస్వామ్య పరిరక్షకులు.. అభివృద్ధిని కోరుకునే వారన్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల యోగ క్షేమాలు తెలుసుకుం టూ అండగా ఉన్నామన్నారు. ప్రజలే బంధువులుగా.. కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

### సిద్దిపేట అంటే ప్రతిష్ట.. ఒక ప్రత్యేకత

సిద్దిపేట అంటే ప్రతిష్ట, ఒక ప్రత్యేకత ఉందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మన సిద్దిపేట అంటే గౌరవం ఉందని, దాన్ని నిలుపుకుందామన్నారు. భగవంతుడి ఆశీస్సులు సిద్దిపేట ప్రజల దీవెనలతో మంచి మెజార్టీతో గెలుస్తామనే సంపూర్ణమైన విశ్వాసం ఉందన్నారు . గత ఐదేండ్లుగా రోజుకు 16 నుంచి 18 గంటలు కష్టపడి పనిచేస్తున్నామని చెప్పారు. ఐదేండ్లు అనే పరీక్ష రాశా.. ఎన్ని మార్కులు వేస్తారో మీరే వేయండి.ఎందుకంటే నిత్యం దేవుడు ఇచ్చిన శక్తితో సిద్దిపేట ప్రజల కోసం పనిచేశానన్నారు. సీఎం కేసీఆర్

సీఎం కేసీఆర్ రూ.200 పింఛన్‌ను రూ.2000 చేశారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ మొదలుకొని మారుమూల పల్లె వరకు స్వచ్ఛమైన తాగునీరు ఇచ్చిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. చెరువులకు మరమ్మతులు చేసి చెక్‌డ్యామ్‌లను కట్టించారన్నారు. కాళేశ్వరంలాంటి ప్రాజెక్టును కట్టి రెండు పంటలకు నీరు అందిస్తున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ నాయకులను నమ్మి ఓట్లు వేస్తే మోసపోయి పదేండ్లు వెనక్కి వెళ్తామన్నారు. కాంగ్రెస్ పాలించే రాష్ట్రాల్లో చూస్తే రూ.600 పింఛన్ లేదన్నారు. రేపు తెలంగాణలో చేస్తారని నమ్మితే మనం మళ్లీ మోసపోయే అవకాశం ఉందన్నారు. గత ఎన్నికల్లో అత్యధిక మెజార్టీని ఇచ్చి

**₹200 పింఛన్ ₹2000**

ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా మార్చామన్నారు. ఒకనాడు తెలంగాణ అంటే కరువు,కటకాలు తెలంగాణ అంటే వలసలు, రైతుల ఆత్మహత్యలు, ఆకలిచావులు ఉండేదని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు.

### 24లక్షల ఉద్యోగాలు కల్పించాం

ప్రైవేట్‌రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులను ఆహ్వానించి 24లక్షల ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. ఐటీ రంగంలో ఆరు లక్షల ఉద్యోగాల కల్పన చేశామని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికే లక్షా 80వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని గుర్తుచేశారు. 'తెలంగాణ ఆచరిస్తున్నది.. దేశం అనుసరిస్తున్నది'' అన్నంత గొప్పగా సీఎం కేసీఆర్ తీర్చిదిద్దారన్నారు.. పక్క రాష్ట్రాల నుంచి ఇక్కడికి వస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఐదు గంటల విద్యుత్ ఇస్తున్నామని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణలో ఇప్పటికే రైతులకు 24గంటల విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రం ప్రజలకు సీఎం కేసీఆర్ శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ మీద నోరు పారేసుకుంటున్నారని, తండ్రి వయస్సు ఉన్న వ్యక్తి మీద సోషల్ మీడియాలో కొందిమంది ఇష్టారీతిన మాట్లాడటం సరికాదన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే రాష్ట్రం అద్భుతమమైన ప్రగతి సాధించిందన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ తల్లి చేతుల్లో ఉంటే ఎంత సురక్షితంగా ఉంటుందో, తెలంగాణ సాధించిన కేసీఆర్ చేతిలో రాష్ట్రం ఉండడం మంచిదన్నారు. తెలంగాణ పల్లెల్లో గుంటభూమి ఎండకుండా పంటలు పండుతున్నాయన్నారు. తాగునీరు, ఆడపిల్ల పెండ్లికి కల్యాణలక్ష్మి, బిడ్డ కాన్పుకుపోతే కేసీఆర్ కిట్టు అందిస్తున్న ప్రభుత్వం ఎక్కడైనా ఉందా? అని మంత్రి హరీశ్‌రావు అన్నారు.

సిద్దిపేట పేరు ప్రఖ్యాతులు నిలబెట్టిన ఘనత సిద్దిపేట ప్రజలదన్నారు. ఈఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ అందించి గౌరవాన్ని కాపాడుకుందామన్నారు. మంత్రి వెంట జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజా శర్మ, సీనియర్ నాయకులు బాలకిషన్ రావు, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పాల సాయిరామ్, సంపత్‌రెడ్డి, ఎంపీపీలు బాలకృష్ణ, శ్రీదేవీచందర్‌రావు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, మెహన్‌లాల్, కాముని శ్రీనివాస్, దువ్వల మల్లయ్య, శ్రీహరి గౌడ్,మైనార్టీ నాయకులు మోహిజ్, బాబుజాని, మజీర్‌ఖాన్, వహీద్‌ఖాన్, ఆర్టీఏ మెంబర్ ఇర్షద్ హుస్సేన్, వెంకటేశం ఉన్నారు.



సిద్దిపేట ఎక్బాల్ మినార్ వద్ద ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేటలోని సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు